క్లుప్తంగా

రూ.1.25 లక్షల మందులు వితరణ



సత్తెనపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు ఆర్యవైశ్య యువజన సంఘం గౌరవాధ్యక్షుడు కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో రూ.1.25 లక్షలు విలువైన రసికాడోట్రిల్ మందులను అందజేశారు. చిల్లపిల్లలు, పెద్దల్లో డయేరియా చికిత్సకు ఈ మందులను ఉపయోగిస్తారు. డిస్ట్రిక్ట్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రావిక్రింది మల్లికార్జునరావు సోమవారం వీటిని వితరణ చేశారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు స్పందిస్తూ.. ఎండాకాలం చిన్న పిల్లలు డయేరియా బారిన పడే అవకాశం ఉందన్నారు. వారు త్వరగా కోలుకునేందుకు ఈ మందులు ఉపయోగపడతాయన్నారు. వైద్యశాల ఏవో భవాని, డాక్టర్ రావిక్రింది శ్రీధర్ ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో పూర్తి వసతులు కల్పించాలి



ముప్పాళ్ళ: ఎన్నికల నేపథ్యంలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో వసతులు త్వరితగతిన కల్పించాలని తహసీల్దారు పి.సింగారావు ఆదేశించారు. మండలంలోని గోళ్లపాడు, నార్నెపాడు, లంకెలకూరపాడు, పలుదేవర్లపాడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన సోమవారం సందర్శించారు. నార్నెపాడు, లంకెలకూరపాడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలైన పాఠశాలల్లో అవసరమైన తాగునీరు, మరుగుదొడ్ల వసతి కల్పించాలని నిర్వాహకుడిని ఆదేశించారు. మరో వారంలోపు నాడు-నేడులో భాగంగా అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు అవసరమైన బారికేడ్లు, వృద్ధులు, దివ్యాంగులకు పోలింగ్ కేంద్రంలోకి వచ్చేందుకు అవసరమైన ర్యాంపు, ఇతర చర్యలు తీసుకోవాలని వీఆర్వోలను ఆదేశించారు. ఆయన వెంట ఆర్ఐ పవన్‌కుమార్, ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివలింగం ప్రతిష్ట

సత్తెనపల్లి: పట్టణం రఘురాంనగర్‌లోని రామాలయం నందు శివలింగం ప్రతిష్ట మహోత్సవం సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మద్యం విక్రేతల అరెస్టు

చిలకలూరిపేట: తెలంగాణా మద్యం అక్రమ విక్రయాలకు పాల్పడుతున్న ఇరువురిని సెబ్ అధికారులు సోమవారం అరెస్టు చేశారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో సోమ వారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎస్‌ఈబీ ఎస్ఐ వి.శశికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గోవిందపురం గ్రామానికి చెందిన కోటా రాజేష్ తెలంగాణా మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. అతని వద్ద నుంచి 12 ఫుల్‌బాటిళ్ల తెలంగాణా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ఇతని ద్వారా నరసరావుపేట పట్టణానికి చెందిన దిలీప్ కుమార్ మద్యం విక్రయాలు చేస్తున్నట్లు తెలుసుకొని అతని ఇంటిపై దాడి చేసి మరో 52 ఫుల్‌బాటిళ్ల తెలంగాణా మద్యాన్ని స్వాధీనం చేసుకొని ఇరువురిని అరెస్టు చేశారు. మొత్తం 64 మద్యం బాటిళ్ల విలువ రూ. 70 వేలు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఈబీ సిబ్బంది చైతన్య, రవిబాబు, నాగరాజు, దిలీప్‌రెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముమ్మరంగా కందుల కొనుగోలు

శావల్యాపురం: మండలంలోని అన్నీ రైతుభరోసా కేంద్రంలో కందుల కొనుగోలు ముమ్మరంగా చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి పల్లపోతుల ప్రవీణ్ తెలిపారు. సోమవారం స్థానిక రైతుభరోసా కేంద్రంలో ఏవో మాట్లాడుతూ మండలంలో అన్నీ గ్రామాల్లో ఖరీఫ్ సీజనులో 1409 ఎకరాలు రైతులు సాగు చేయగా ఒక్కో ఎకరానికి 5 నుంచి 6 క్వింటాల వరకు దిగుబడులు వచ్చాయన్నారు. ఇప్పటి వరకు 256 మెట్రిక్ టన్నులు కందులు కొనుగోలు చేశామన్నారు. నాఫెడ్ క్వింటా మద్దతు ధర రూ.9729 రూపాయలు కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతులకు సంబంధించి గోనె సంచులు, కూలీ రవాణా చార్జీలు క్వింటాకు రూ. 74 రూపాయలకు ప్రభుత్వం భరిస్తుందన్నారు. మార్కెటింగ్ ప్రమాణాలు మేరకు కొనుగోలు పారదర్శకంగా చేస్తున్నట్లు చెప్పారు. కందులు అమ్మిన రైతులకు నాలుగు రోజుల వ్యవధిలో నగదు ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. రైతులు పండించిన కంది పంట చివరి గింజ వరకు రైతుభరోసా కేంద్రాలు ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. రైతులు దళారుల నుంచి మోసపోకుండా ఉండటానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈఅవకాశాన్ని రైతులందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కలిసికట్టుగా జగనన్నను గెలిపించుకుందాం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పిలుపు



వేల్పూరులో పార్టీ నాయకులతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులందరూ కలసికట్టుగా పని చేసి, పెదకూరపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేద్దామని, జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకుందామని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పిలుపునిచ్చారు. మండలంలోని వేల్పూరు, కొనూరు గ్రామాల్లో ఆదివారం రాత్రి ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో భేటీ అయ్యారు. స్థానిక పార్టీ పరిస్థితులపై ఆరా తీశారు. మునుపెన్నడూ జరగని విధంగా గత ఐదేళ్లలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాల రూపంలో ఎవరెవరికి ఎంత లబ్ధిచేకూరిందో స్పష్టంగా వివరించాలని మార్గనిర్దేశం చేశారు. మరో 40 రోజులు కష్టపడాలని, వచ్చే ఐదేళ్లు అందరికీ సేవ చేసే సువర్ణావకాశాన్ని ఇవ్వాలని కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడగానే మాదిపాడు వద్ద కృష్ణానదిపై వంతెన నిర్మాణం, పులిచింతల ప్రాజెక్టు నుంచి అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాలకు బ్యాక్ వాటర్ ద్వారా సాగునీటిని అందజేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. యువత ఉపాధి కోసం ఒక పరిశ్రమ స్థాపించేందుకు ఆలోచిస్తున్నట్లు తెలిపారు. కోనూరులో కొడవటి యశ్వంత్ అనే విద్యార్థి తాను గీసిన ఎమ్మెల్యే చిత్రాన్ని చూపించి, తన అభిమానాన్ని చాటుకున్నాడు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, కోనూరు మాజీ సర్పంచ్ వాశిరెడ్డి వెంకటేశ్వరరావు, మత్సా శ్రీనివాసరావు, ఎంపీటీసీ యండ్రపల్లి నటరాజు, గ్రామపార్టీ కన్వీనర్ పాగెళ్ల శ్రీనివాసరావు, వేల్పూరులో సొసైటీ మాజీ అధ్యక్షుడు నల్లపాటి సూర్యనారాయణ, పొన్నెకంటి వెంకట్రావు, బీసీ నాయకులు గుంజి వెంకట్రావు, ఎస్సీ సెల్ కన్వీనర్ శిఖా తిమోతి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు

అచ్చంపేట: నిండుజర్ల గ్రామానికి చెందిన టీడీపీ మద్దతుదారులైన బీసీ కుటుంబాలు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరాయి. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తనయుడు నంబూరు కల్యాణ్‌చక్రవర్తి పార్టీ కండువాలు కప్పి వారికి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు వైఎస్సార్ సీపీ దిక్సూచిలా పనిచేస్తుందన్నారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన రెడ్డి అయితేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. దూళ్ల మల్లయ్య, బత్తుల పిచ్చయ్య, కొండ్రాజు నాగరాజు తదితరులు తమ కుటుంబాలతో సహా వైఎస్సార్ సీపీలో చేరారు. మార్కెట్‌యార్డు డైరెక్టరు మేకల శ్రీనివాసరావు, గ్రామ నాయకులు చొప్పరపు రామయ్య, యల్లమందయ్య, రంగయ్య పాల్గొన్నారు.

మునగోడు అంకమ్మతల్లి సన్నిధిలో ఎమ్మెల్యే నంబూరు

అమరావతి: మహిమాన్వితురాలైన మునగోడు అంకమ్మతల్లి దీవెనలతో మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని మునగోడు ఎస్టీ కాలనీలోని అంకమ్మ తల్లిని ఆయన దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించిన అనంతరం ఆశీర్వచనం అందించి, అమ్మవారి శేషవస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు మాట్లాడారు. గత ఎన్నికల్లో భారీ మెజార్టీ ఇచ్చి తనను మునగోడు గ్రామస్తులు ఆశీర్వదించారని గుర్తుచేశారు. అలాగే మునగోడును అభివృద్ధిచేసి, సంక్షేమ కార్యక్రమాలు గ్రామస్తులందరికీ అందించామన్నారు. మరొసారి ఎమ్మెల్యేగా తనను, సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని గ్రామస్తులను కోరారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, జేసీఎస్ అధ్యక్షుడు నాయుడు రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు నంబూరు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

11 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీలో చేరిన పాపాయపాలెం వాసులతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

బెల్లంకొండ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పాపాయపాలెం గ్రామానికి చెందిన 11 కుటుంబాల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో క్రోసూరులోని పార్టీ కార్యాలయంలో సోమవారం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాలడుగు బుజ్జి, రామాంజీ, జొన్నలగడ్డ వెంకటేష్, బిట్రగుంట రామారావు, తిరుపతయ్య, అబ్బులు, కిచ్చంశెట్టి భాస్కరరావు, వల్లూరి లక్ష్మీనారాయణ, షేక్ మస్తాన్, మర్రి లక్ష్మీరెడ్డి, లక్ష్మీరెడ్డి కుటుంబాలకు చెందిన వారు పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే శంకరరావు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే మంచి చేస్తున్న ప్రభుత్వానికి అండగా ఉండేందుకు స్వచ్ఛందంగా పార్టీలోకి పెద్ద ఎత్తున చేరికలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిమటా మాధవి, వెంకటసైదయ్య, ఎంపీటీసీ మర్రి శ్రీనివాసరెడ్డి, మర్రి బ్రహ్మారెడ్డి, మర్రి చిన బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

గృహిణి.. వినూత్న ప్రచార బాణి



గ్రామస్తులతో ఆప్యాయ పలకరింపు..



హోటల్‌లో దోశ వేస్తూ

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శంకరరావు సతీమణి వసంతకుమారి
- చిరు వ్యాపారుల సాధకబాధలు తెలుసుకుంటూ ముందుకు..

అచ్చంపేట: పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఎన్నికల ప్రచార భారాన్ని ఆయన జీవిత భాగస్వామి నంబూరు వసంతకుమారి పంచుకున్నారు. వినూత్న రీతిలో చిరు వ్యాపారులను పలకరిస్తూ..వారి సాధక బాధలను తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఆదివారం సాయంత్రం అచ్చంపేటలో ఓ హోటల్‌కు వెళ్లి వేడివేడి బజ్జీలు, ఉల్లిదోశ వేసి తన పాక ప్రావీణ్యం చూపారు. కొబ్బరి బోండాలు కొట్టారు.పండ్ల దుకాణంలో కౌంటర్‌లో కూర్చున్నారు.. యువకులను ప్రోత్సహించారు. మహిళలతో మమేకమై ఆప్యాయంగా పలకరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ.. లబ్ధిదారులు తమకు ఫలాన పథకం డబ్బులు వచ్చాయని సంతృప్తి వ్యక్తం చేస్తుంటే.. వారి సంతోషాన్ని చూస్తూ ఉప్పొంగిపోయారు. ఈ సంతోషం ఇలాగే కొనసాగాలంటే 'ఎమ్మెల్యేగా మీ శంకరన్నను.. ఎంపీగా అనిల్ అన్నను.. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని, మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నను చూసుకోవాలి'. అంటూ స్థానికులను ఓటు అభ్యర్థించారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, సర్పంచ్ షేక్ జాని, అచ్చంపేట కన్వీనర్ షేక్ సమరం, మాజీ సర్పంచ్ కంబాల వీరబాబు, ఆర్యవైశ్య నాయకులు అన్నవరపు శ్రీనివాసరావు, భవిత మండల సమాఖ్య అధ్యక్షురాలు రత్నమంజీర పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా

- హుస్సేన్‌నగరం సచివాలయం పరిధిలో 19 మంది..
- ప్రజా సేవకు చంద్రబాబు, పవన్ కల్యాణ్ దూరం చేశారని ఆగ్రహం
- ఇకపై వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ



పెదకూరపాడు ఎంపీడీవో మల్లేశ్వరికి రాజీనామా పత్రం అందిస్తున్న పాడపాడు వలంటీర్లు

పెదకూరపాడు: ప్రజలకు సేవ చేసే వలంటీర్లను గోనె సంచులు మోసే వారని అవమానించినా భరించాం.. మహిళలను అక్రమ రవాణ చేసే వారు అన్నా సహించాం.. కానీ నేడు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు పేద ప్రజలకు రేషన్, పింఛన్ ఇచ్చేందుకు వీలులేకుండా.. కుట్ర పన్ని ప్రజా సేవకు దూరం చేశారని సచివాలయ వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మండలంలోని హుస్సేన్ నగరం గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న 19 మంది వలంటీర్లు, పాడపాడు గ్రామంలోని ఆరుగురు వలంటీర్లు మొత్తం 25 మంది సోమవారం రాజీనామా పత్రాలను ఎంపీడీవో మల్లేశ్వరికి అందించారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లు కూడా అప్పగించారు. వలంటీర్ల సంఘం నాయకుడు వెలితోటి చిన్నబాబు మాట్లాడుతూ ప్రజలకు చేసే అవకాశం ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆది నుంచి వలంటీర్లపై అక్కసు వెళ్లగక్కుతున్నారని, పేద ప్రజలకు సేవ చేయకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో ప్రజలకు వలంటీర్లు చేసిన సేవను ప్రజలు మరువలేరన్నారు. ఇకపై బహిరంగగానే వైఎస్సార్ సీపీ అభ్యర్థి నంబూరు శంకరరావు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

అవ్వాతాతలను కష్టపెట్టిన పాపం ఊరికేపోదు

- జగనన్న మళ్లీ సీఎం అవ్వగానే ఇంటి వద్దకే పింఛను
- స్పష్టం చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు



పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అమరావతి: పింఛను పంపిణీపై ఫిర్యాదుల చేసి, అవ్వాతాతలను ఎండాకాలంలో కష్టపెట్టిన పాపం తెలుగుదేశం పార్టీకి ఊరికే పోదని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో ప్రతినెలా వలంటీర్లు 1వ తేదీన వేకువ ఝామునే పింఛన్లు ఇచ్చారన్నారు. ప్రజలకు ఏ అవసరమొచ్చిన అండగా నిలిచి, ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా వ్యవహరించారని చెప్పారు. ప్రజల మన్ననలు పొందిన వలంటీర్లపై టీడీపీ మొదటి నుంచి విషం కక్కుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వలంటీర్లను ఇష్టారాజ్యంగా మాట్లాడి వారి ఆత్మస్థైరాన్ని దెబ్బతీయాలని కుట్రలు పన్నుతోందని మండిపడ్డారు. ప్రస్తుతం ఎన్నికల వేళ టీడీపీ అనుకూలుడైన నిమ్మగడ్డ రమేష్ చేత ఫిర్యాదు చేయించి, వృద్ధులకు, మహిళలకు ఇంటికి పెన్షన్ అందకుండా..ఎన్నికల కోడ్‌ను అడ్డుపెట్టుకుని నాటకం ఆడుతున్నారన్నారు. అవ్వాతాతలు, దివ్యాంగులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కాగానే.. పింఛనుదారుల ఇళ్ల వద్దకే వచ్చి వలంటీర్లు పింఛను నగదు పంపిణీ చేస్తారని భరోసానిచ్చారు. మండల జేసీఎస్ అధ్యక్షుడు నాయుడు రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు నంబూరు బాబురావు, మంచికలపూడి వీరరాఘవయ్య, నందూరు కరుణకుమార్ పాల్గొన్నారు.

హోంగార్డులకు పోలీసు శాఖ అండగా ఉంటుంది

జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: నిబద్ధతతో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన హోంగార్డులకు పోలీస్ శాఖ ఎప్పుడు అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పదవి విరమణ పొందిన హోంగార్డు ఎస్ వి శ్రీనివాసరావుని ఘనంగా సన్మానించి జిల్లా పోలీసుల తరపున బహుమతి అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 1996 నుంచి హోంగార్డు విధులలో ప్రవేశించి పల్నాడు యూనిట్‌లో 28 ఏళ్లపాటు విశేష సేవలు అందించాడన్నారు. ఎలాంటి సమస్య వచ్చిన తనను నేరుగా సంప్రదించి తెలపవచ్చునని సూచించారు. సేవింగ్స్ ఇతర బెనిఫిట్స్ త్వరగా అందే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏఆర్ అదనపు ఎస్పీ డి.రామచంద్రరాజు, హోంగార్డు ఆర్ ఐ ఎస్ కృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పు తెలుసుకుని సొంతగూటికి



వైఎస్సార్ సీపీలో తిరిగి చేరిన వాసుమల్ల సాంబయ్య

దొడ్లేరు(క్రోసూరు): ప్రలోభాలకు, మాయమాటలకు మోసపోయి తెలుగుదేశం పార్టీలో చేరానని, తప్పు తెలుసుకుని తిరిగి వైఎస్సార్ సీపీలో చేరినట్లు ఆ పార్టీ కార్యకర్త వాసుమల్ల సాంబయ్య అన్నారు. దొడ్లేరు గ్రామానికి చెందిన వాసుమల్ల సాంబయ్య ఇటీవల టీడీపీలోకి వెళ్లారు. సోమవారం సాయంత్రం సొంతగూటికి చేరుకున్నారు.

క్రోసూరులోని ఎమ్మెల్యే శంకరరావు కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షుడు వెలది అప్పారావు ఆధ్వర్యంలో తిరిగి వైఎస్సార్ సీపీలో చేరారు. టీడీపీ నేతలు ప్రలోభాలకు గురి చేస్తున్నారని, ఎవరూ వారికి లొంగిపోవద్దని సాంబయ్య ఈ సందర్భంగా అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని, ఎమ్మెల్యే నంబూరుశంకరరావు నియోజకవర్గానికి కావాల్సిన ప్రజానాయకుడని కొనియాడారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ కోటయ్య, అడితి ముస్తఫా, దొడ్లేరు నాయకులు ఉన్నారు.

ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి



గురవాయపాలెంలో ఓటరు అవగాహన ర్యాలీలో పాల్గొన్న డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్

నరసరావుపేట రూరల్: ప్రజాస్వామ్యాన్ని గౌరవించే ప్రతిఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.బాలునాయక్ తెలిపారు. మండలంలోని గురవాయపాలెంలో సోమవారం ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలునాయక్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఓటు హక్కు కలిగిన వారందరూ ఎన్నికల్లో తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని చెప్పారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగం, ఓటు ఆవశ్యకతపై నినాదాలు చేస్తూ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం ఓటర్లు, మహిళాసమాఖ్య సభ్యులచే ప్రతిజ్ఞ నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చిలకలూరిపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం తెల్లవారుజాము చోటు చేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని కుమ్మరకాలనీకి చెందిన రామకృష్ణ(32) మిత్రుడు డేనియల్‌తో కలసి ద్విచక్రవాహనంపై విజయబ్యాంకు సమీపంలో జాతీయ రహదారి దాటుతున్నారు. ఈ క్రమంలో ఒంగోలు నుంచి గుంటూరు వైపు వెళుతున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న రామకృష్ణ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 సిబ్బంది గాయపడిన డేనియల్, లారీ డ్రైవర్ షేక్ దరియావలిని పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించి, మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కీలక నేత

- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన మంత్రి అంబటి
- రాజుపాలెం మండలంలో తెలుగుదేశం పార్టీకి గట్టి దెబ్బ



వెంకటప్పయ్యకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి అంబటి

సత్తెనపల్లి: తెలుగుదేశం పార్టీ నుంచి కీలకమైన నేతలు వరుసగా వైఎస్సార్ సీపీ లో చేరుతున్నారు. రాజుపాలెం మండల కేంద్రానికి చెందిన ముఠ్రిబోయిన వెంకటప్పయ్య టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి సేవలందించారు. సోమవారం రాత్రి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సమక్షంలో ఆయన వైఎస్సార్ సీపీలో చేరారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి అంబటి ఆయనకి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీలో అన్ని సామాజిక వర్గాలకు సముచిత స్థానం లభిస్తుందన్నారు. కష్టపడి పనిచేసి రాజుపాలెం మండలంలో అత్యధిక మెజార్టీతో పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. వెంకటప్పయ్య 2001లో మాజీ ఎంపీపీ బత్తుల రామస్వామిపై పోటీ చేసి ఓటమిపాలయ్యారని, రాజుపాలెం మండలంలో టీడీపీలో కీలక నేతగా ఉన్నారన్నారు. ఆయన పార్టీ మారటం ఎన్నికల సమయంలో టీడీపీకి గట్టి ఎదురు దెబ్బ. ఈ సందర్భంగా వెంకటప్పయ్య మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో సరైన గుర్తింపు లేదని, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాజకీయాలకు అతీతంగా చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని గమనించి పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు వేపూరి శ్రీనివాసరావు, నాయకులు మర్రి సుబ్బారెడ్డి, ఆరుద్ర శ్రీనివాసరావు, పాలువాయి ఆదినారాయణ, షేక్ బాష, ఎస్.వెంకటరెడ్డి ఉన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు విలువైంది



బొల్లాపల్లి: ప్రతి ఓటరు ఓటు హక్కు వినియోగించుకోవాలని తహసీల్దార్, ఏఆర్వో బి.వి.రమణారావు తెలిపారు. మండల కేంద్రంలో ఓటు హక్కుపై పౌరులకు సోమవారం అవగాహన కల్పించారు. గ్రామవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రధానకూడలిలో మానవహారంగా ఏర్పడి ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేశారు. దృఢమైన, చైతన్యవంతమైన ప్రజాస్వామ్యంలో ఓటు విలువైంది, పవిత్రమైనది, వజ్రాయుధమని ఏఆర్వో తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. దివ్యాంగులు, 85 సంవత్సరాలు నిండిన ఓటర్లకు హోం ఓటింగ్ సదుపాయం కల్పించామని తెలిపారు. ఓటును స్వేచ్ఛగా వేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి పోలీస్ భద్రత ఉంటుందని, శాంతియుతంగా, స్వేచ్ఛగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంసీసీ వి.ఎ.విజయ్‌కుమార్, ఈవోపీఆర్‌డీ, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎస్‌కే జిలానీబాషా, ఎస్ఐ డి.చెన్నకేశవులు, బీఎల్‌వోలు, ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

వినుకొండ(నూజెండ్ల): ఓటు హక్కుపై నూజెండ్ల గ్రామంలో స్వీప్ ప్రోగ్రామ్ జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ఎన్నికల అధికారులు పాల్గొని విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు యొక్క విలువ, ఓటు వేయకపోవడం వల్ల జరిగే నష్టం గురించి వివరించారు. ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారి, తహసీల్దార్, ఎస్‌కే సయీమ్ అహమ్మద్, ఎంపీడీవో వీరభద్రాచారి, ఐనవోలు ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి, ప్రభుత్వ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

రెంటచింతల: ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో ఎవ్వరూ కూడా వ్యక్తిగతంగా రూ.50 వేలకు మించి నగదును తీసుకువెళ్లవద్దని మండల ఎన్నికల నియమ నిబంధనల పర్యవేక్షణ (ఫ్లయింగ్ స్క్వాడ్) అధికారి కె.పాపయ్య అన్నారు. ఈ సందర్భంగా పాపయ్య మాట్లాడుతూ సోమవారం రెంటచింతల-గురజాల గ్రామాల మధ్య ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు మాచర్ల-గుంటూరు ప్రధాన రహదారిపై వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 2024 మే 13న ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ముమ్మరంగా తనిఖీలు చేపట్టడం జరుగుతుందన్నారు. మండలంలోని గ్రామాలలో పర్యటిస్తూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయడంలో భాగంగా ఈ తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు.

వాహనాలలో నగదు, మద్యం, బంగారం, వెండి వస్తువుల తరలింపును నియంత్రించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టామన్నారు. ప్రజలు కూడా గ్రామాలలో ఎక్కడైనా ఎన్నికల నియమ నిబంధనలకు వ్యతిరేక పనులకు పాల్పడుతున్న వారి సమాచారం సి-విజిల్ యాప్ ద్వారా తమకు ఇచ్చినట్లయితే వెంటనే ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయడం జరుగుతుందన్నారు. మొత్తం 68 వాహనాలను తనిఖీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తనిఖీ సిబ్బంది తదితరులున్నారు.

నవోదయకు ఏడుగురు విద్యార్థులు ఎంపిక



రొంపిచర్ల: మండలంలో నవోదయ 2024 ఎంట్రన్స్ టెస్ట్ ఫలితాల్లో కేరళ మోడల్ స్కూల్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థుల్లో ఫణిదపు రేవతి, కోట ప్రసిద్ధి, నంబుల సుప్రియ, పుల్లగూర జనీవ, మేరీ జోష్ బాబు, మాణిక్యరావు, విష్ణు తేజ ఉన్నారు. వీరందరినీ ఎంఈవో బ్రహ్మేశ్వరరావు అభినందించారు.

•వాహనాల తనిఖీ

రొంపిచర్ల: అన్నవరప్పాడు గ్రామ సమీపంలోని పల్నాడు, ప్రకాశం జిల్లాల బోర్డర్‌లో కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్‌వే పోలీసు చెక్ పోస్టు వద్ద ఎన్నికల నేపథ్యంలో సోమవారం రాత్రి వాహనాల తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ వి.ఎస్.ఎన్. వర్మ, సీఐ మల్లిఖార్జునరావు, ఎస్ఐ కే.పీ. రవీంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



వెల్దుర్తి: మాచర్ల నుంచి మిర్చి కూలీ పనుల నిమి త్తం వెల్దుర్తి మండలంలోని కండ్లకుంట గ్రా మానికి వెళ్లేందుకు ఆటోలో ప్రయాణిస్తుండగా మండాది సమీపంలో ఆటోకు ఎదురుగా అడవి పందులు రావటంతో ఆటో బండిని ఢీకొట్టింది. ఆటో బోల్తా పడటంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఆర్.నారాయణమ్మ (45) అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని హుటాహుటిన మాచర్ల ప్రభు త్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకు నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.